## ఎన్నికల నియమావళి

# తప్పక పాటించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు తూ.చ తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఓటు హక్కు నమోదు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, దివ్యాంగులు-వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగం, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువాంర ఐడీవోసీ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఓటు హక్కు నమోదుకు అక్టోబర్ 31 వరకు అవకాశం ఉన్నందున ఓటర్ల నమోదుకు చొరవ చూపాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు చేసేందుకు 24 గంటలు పనిచేసేలా 1950 నంబర్‌తో కంట్రోల్ రూం, 'సీ విజిల్' యాప్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులకు సువిధ సింగిల్ విండో ఆన్‌లైన్ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవచ్చని అన్నారు. రూ.50 వేలకు మించిన నగదు, విలువైన వస్తువులతో వెళ్తున్నప్పుడు ఆధారాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సరైన ఆధారాలు చూపకపోతే సీజ్ చేస్తామన్నారు. వాటిని విడుదల చేయాలంటే ముగ్గురు అధికారులతో కూడిన కమిటీ సిఫార్సు ఉండాలన్నారు. ప్రైవేట్ స్థలాల్లో ప్రచార సామగ్రి ఏర్పాటుకు కూడా అనుమతి పత్రం ఉండాలన్నారు. లేనట్లయితే ఆ సామగ్రిని తొలగిస్తామన్నారు. దివ్యాంగ ఓటర్లను మార్కింగ్ చేసినట్లు చెప్పారు. తక్షణమే మార్కింగ్ చేసుకోవాలన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపడతామన్నారు. రాత్రి 10.00 నుంచి ఉదయం 6.00 గంటల వరకు ప్రచార కార్యక్రమాలకు అనుమతి లేదని చెప్పారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వివరాలను వెల్లడించారు. పినపాకకు మణుగూరు తహసీల్ కార్యాలయం, ఇల్లెందుకు ఇల్లెందు తహసీల్ కార్యాలయం, కొత్తగూడేనికి కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం, అశ్వారావుపేటకు అశ్వారావుపేట తహసీల్ కార్యాలయం, భద్రాచలానికి సబ్ కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు దారా ప్రసాద్, డి ప్యూటీ తహసీల్దార్ రంగాప్రసాద్, నాయకులు ప్రభాకర్‌రావు(ఆమ్ ఆద్మీ), లక్ష్మణ్ అగర్వాల్(బీజేపీ), షేక్ అన్వర్(బీఆర్ఎస్), వై.శ్రీనివాసరెడ్డి(సీపీఐ), అన్నవరపు సత్యనారాయణ(సీపీఎం) పాల్గొన్నారు.

#### మీడియా కేంద్రం ప్రారంభం

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 12: ఐడీవోసీలోని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల గురువారం ప్రారంభించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, డీపీఆర్‌వో శ్రీనివాసరావు, ఎంసీఎంసీ కమిటీ సభ్యులు శ్రీనివాసన్, జునుమాల రమేష్ పాల్గొన్నారు.

#### సీజ్ చేసిన నగదుపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 12: సీజ్ చేసిన నగదు తదితరాలకు సంబంధించి సమగ్ర నివేదికలు ఇవ్వాలని నోడల్ అధికారులను కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాక ఆల ఆదేశించారు. ఆమె గురువారం ఐడీవోసీ నుంచి పోలీస్, ఆబ్కారీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం 9.00 గంటల వరకు నివేదికలు ఇవ్వాలన్నారు. సీజ్ చేసిన నగదు తదితరాల విడుదలకు సిఫార్సు చేసేందుకు డీఆర్‌డీవో మధుసూధన్‌రాజు, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ట్రెజరీ అధికారి దుర్గాంబతో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన నగదు తదితరాల కోసం జిల్లా వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు(9100115679)ను తగిన ఆధారాలతో సంప్రదించవచ్చని చెపన్నారు. రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాంబాబు, శిరీష, మంగీలాల్, కాశయ్య, మధుసూధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ కూసింది.. పంపిణీకి బ్రేక్ పడింది

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12: ఎన్నికల కోడ్ అమలు కారణంగా ఆడపడుచులకు బతుకమ్మ చీరెల పంపిణీ నిలిచిపోయింది. చీరెల పంపిణీని నిలిపివేయాలని గురువారం మధ్యాహ్నం ఎన్నికల అధికారి ఆదేశాలిచ్చారు. దీనిని జిల్లా అధికారులు వెంటనే అమలు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 95,553 మందికిగాను ఇప్పటికే 68,990 (దాదాపు 72 శాతం) చీరెల పంపిణీ పూర్తయింది. ఇప్పటికే 70 శాతానికి పైగా పంపిణీ చేసినట్లు మెప్మా జిల్లా కో-ఆర్డినేటర్ రాజేష్ చెప్పారు. మొదటి విడతలో వచ్చిన 74,540 చీరెలలో 68,990 పంపిణీ చేసినట్లు, గోడౌన్‌లో 5,550 ఉన్నట్లు వివరించారు.

## విగ్రహాలకు ముసుగు

చుంచుపల్లి, అక్టోబర్ 12: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలోగల రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు గురువారం ముసుగులు చేశారు. దీనిని జిల్లా ఎన్నికల ప్రవర్తన నియమావళి నోడల్ అధికారి మెరుగు విద్యాలత పరిశీలించారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్లను సిబ్బంది తొలగించారు. ఎంపీడీవో మందా మంగమ్మ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు జర్పుల రవి, బొంతు బాబురావు, వెంకటేశ్వర్లు, హనుమంతు, చెన్నకేశవులు, ఎం.జ్యోతి, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎడ్యుకేషన్: త్రివేణి స్కూల్‌లో..



జూలూరుపాడు: జిల్లాపరిషత్ సెకండరీ స్కూల్‌లో..



చుంచుపల్లి: పెనగడప ప్రాథమిక పాఠశాలలో..

# బతుకమ్మ సంబురాలు

ప్రభుత్వ/ప్రవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం బతుకమ్మ పండుగ జరుపుకున్నారు. పాఠశాలలకు ప్రభుత్వం శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించడంతో గురువారమే వేడుక చేసుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **- నమస్తే నెట్‌వర్క్**



పాల్వంచ: డీఏవీ స్కూల్‌లో..



రామవరం: రుద్రంపూర్ జడ్పీ హైస్కూల్‌లో..



చుంచుపల్లి: సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో..



చర్ల: గురుదేవ్ విద్యాలయంలో..



భద్రాచలం: లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో..



పాల్వంచ: డీఏవీ స్కూల్‌లో..



జూలూరుపాడు: పెమడేల బాగ్యమ్మ మెమోరియల్ స్కూల్‌లో..



లక్ష్మీదేవిపల్లి: ఇందిరానగర్ కాలనీ పాఠశాలలో..